వేర్పాటువాదాన్ని సహించం: చైనా

బీజింగ్: తైవాన్‌లో ఎటువంటి "వేర్పాటువాద కార్యకలాపాలను" సహించబోమని చైనా హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే ఈ ద్వీపాన్ని కలుపుకుంటానని పునరుద్ఘాటించింది. తైవాన్‌ను తమ భూభాగంలో భాగంగా పేర్కొంటున్న బీజింగ్, అమెరికా ప్రతినిధుల స్పీకర్ నాన్సీ పెలోసి రాకతో తైవాన్ చుట్టూ అసాధారణ సైనిక విన్యాసాల నేపథ్యంలో తాజా హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు చైనాలోని తైవాన్ వ్యవహారాల కార్యాలయం ఆగస్టు 10న ఒక శ్వేత పత్రాన్ని ప్రచురించింది, శాంతియుత పునరేకీకరణ కోసం మేము అవకాశానికి సిద్ధంగా ఉన్నాము, అయితే మేము ఏ రూపంలోనూ వేర్పాటువాద కార్యకలాపాలకు ఆస్కారం ఇవ్వం" అని పేపర్ పేర్కొంది.బల ప్రయోగ అవకాశాలనూ తోసిపుచ్చం. చైనా చివరిసారిగా 2000సంవత్సరంలో ఈ శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. దాదాపు 22ఏళ్ల తర్వాత భారీ సైనిక విన్యాసాల మధ్య మరోసారి ఈ పత్రాన్ని విడుదల చేసింది. 2016లో త్సాయి యంగ్ వెన్ అధికారంలోకి వచ్చాక చైనాతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

క్యూబా చమురు నిల్వల్లో 40శాతం ఆవిరి

హవానా: క్యూబా దేశ ప్రధాన చమురు నిల్వల్లో 40శాతం అగ్నికి ఆహుతైంది. మతంజాస్ సూపర్ ట్యాంకర్ పోర్టులోని నాలుగు ట్యాంకర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. క్యూబాలోని అత్యధిక చమురు దిగుమతి చేసుకునే పోర్టు ఇదే. ఇక్కడినుంచి సరఫరా అయ్యేచమురును ప్రధానంగా విద్యుత్తు తయారీకి వినియోగిస్తారు. ఈ పోర్టులోని ట్యాంకర్‌పై పిడుగుపడడంతో మంటలు అంటుకున్నాయి. అదివారం నుంచి ఈ మంటలు మిగిలిన మూడు ట్యాంకర్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను అదుపుచేసేందుకు మెక్సికో, వెనిజులా నుంచి సుమారు 100 మంది సిబ్బందిని ఈ ప్రదేశాలకు పంపినట్లు సమాచారం. మంటలు కొనసాగడతోదగ్గరకు ఎవరూ వెళ్లలేని పరిస్థితి. భారీగా కాలుష్యం వ్యాప్తి చెందడంతో ప్రజలు మాస్కులు ధరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆమ్లవర్షాలు కూడా పడే అవకాశం ఉందని వితావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు.

కేకేఈ సంఘీభావం

క్యూబా కమ్యూనిస్ట్ పార్టీకి. మతంజాస్ కాల్పులను ఎదుర్కొన్న ప్రజలకు కేకేఈ సంఘీభావం తెలిపింది. మతంజాస్‌లోని చమురు కర్మాగారంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం సందర్భంగా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) అంతర్జాతీయ సంబంధాల విభాగం సంఘీభావ సందేశాన్ని పంపింది. క్యూబా సెంట్రల్ కమిటీకి, ప్రభుత్వానికి, క్యూబా ప్రజలకు మాతాంజస్ చమురు కేంద్రాల వద్ద సంభవించిన భారీ అగ్నిప్రమాదం, విధ్వంసానికి అంతర్జాతీయ సంఘీభావాన్ని తెలియజేసింది. అగ్నిమాపక సిబ్బందికి, సాయుధ బలగాలకు, మంటలను ఆర్పేందుకు, తప్పిపోయిన వారిని రక్షించేందుకు వీరోచితంగా పోరాడుతున్న వారందరికీ మా సంఘీభావం తెలియజేస్తున్నాము. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని కేకేఈ పేర్కొంది.

ప్రశాంతంగా కెన్యా ఎన్నికలు

నైరోబి : కెన్యా అధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రైలా ఒడింగా, విలియం రూటో అధ్యక్ష పదవికి గట్టి పోటీలో ఉన్నారు. తదుపరి దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకునేందుకు కెన్యా ప్రజలు మంగళవారం పోలింగ్ బూత్‌ల వద్ద భారీగా క్యూలు కట్టారు. కొన్ని చోట్ల రాత్రి పూట కూడా పోలింగ్ జరిగినట్లు సమాచారం. దీంతో పోలింగ్ సమయాన్ని పొడిగించడమైంది. పెరుగుతున్న ఆహార ధరలు, అవినీతితో విసిగిపోయిన పౌరులు.. అధికార మార్పు కోసం భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. యువ ఓటర్లు ఈ పోలింగ్‌పై ఆసక్తి కనబర్చలేదు. అసమానతలు, మారని అభ్యర్థులు, రాజకీయ వ్యవస్థపై విసుగు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో ఓటు నమోదు చేసుకోలేదని ఎన్నికల సంఘం గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కెన్యా మాజీ అధ్యక్షుడు ఆరెంజ్ డెమొక్రటిక్ అలియన్స్ అభ్యర్థి రైలా ఒడింగా(77)తో పాటు ప్రస్తుత ఉపాధ్యక్షుడు, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి విల్లియం రూటో(55) మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు ఉరుహు కెన్యాట్టా ఇప్పటికే రెండు సార్లు పదవిని చేపట్టడంతో.. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడయ్యారు. అయితే ఆయన దీర్ఘకాల ప్రత్యర్థి ఒడింగాకు మద్దతునివ్వడం ఆశ్చర్యం.

గతంలో పోలింగ్‌లో జరిగిన అవకతవలకు దృష్టిలో ఉంచుకున్న ఎన్నికల సంఘం ఈ సారి భారీ భద్రత చర్యలు తీసుకుంది. కెన్యాలో గెలవాలంటే అభ్యర్థికి 50 శాతానికి పైగా ఓట్లు రావాల్సి ఉంటుంది. అలాగే కెన్యాలోని 47 కౌంటీల్లో 24లో పావు వంతు ఓట్లు అవసరం.

ప్రభుత్వ ఆర్థిక విధానాలపై గురువుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర జాప్యం జరుగుతోందని వివరించారు. దీంతో ఉపాధ్యాయులు ఆర్థిక అవసరాలు తీరక చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, కరవు భత్యం చెల్లింపులోనూ జాప్యం నెలకొంద న్నారు. వాటిని జులై చివరకు పరిష్కరిస్తామని మంత్రి వర్గం, సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాలతో జరిగిన సమావేశంలో హామీ ఇచ్చిన ప్పటికీ, ఇంతవరకూ నెరవేర్చలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని, లేకుంటే, కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్ఎంఎస్) రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 11వ పీఆర్సీ పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీన ప్రక్రియను నిలుపుదల చేసి 117 ,128 జీవోలను రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయా జిల్లాల ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహించారు.

బీహార్ సీఎంగా నితీశ్

(మొదటిపేజీ తరువాయి)

వైపుల నుంచి ఒత్తిడి రావడంతో పదవీ బాధ్యతలు స్వీకరించానని గుర్తుచేశారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(యూ) 70 సీట్లు గెలుచుకోగా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 43కు పరిమితం కావడాన్ని ప్రస్తావించారు. అప్పట్లో చాలా విషయాలు జరిగాయని, అందుకే బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని జేడీ(యూ) నాయకులు నిర్ణయించారని నితీశ్ తెలిపారు.

కొత్త మంత్రివర్గంపై ఊహాగానాలు

ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌తో కలిపి కొత్త కేబినెట్‌లో 16 మంది ఉంటారని తెలుస్తోంది. ఇతర పార్టీల నుంచి అలోక్ మెహతా, లలిత్ యాదవ్, అనితా దేవి, కుమార్ సర్వజిత్, భాయి వీరేంద్ర, సురేంద్ర రామ్, వీణా సింగ్ మంత్రివర్గంలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. జేడీ(యూ) నుంచి 13 మంది.. విజయ్ చౌదరి, అశోక్ చౌదరి, విజేంద్ర యాదవ్, సంజయ్ ఝా, ఉపేంద్ర కుష్వాహా, శ్రవణ్ కుమార్, జమా ఖాన్ కొత్త మంత్రులుగా ప్రమాణం చేస్తారని పార్టీ వర్గాల సమాచారం. మహాకూటమిలో భాగమైన కాంగ్రెస్ నుంచి మదన్ మోహన్ ఝా, అజిత్ శర్మ, షకీల్ అహ్మద్ ఖాన్, రాజేశ్ కుమార్ రామ్‌కు కేబినెట్ స్థానాలు దక్కవచ్చని తెలుస్తోంది. హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యూలర్) పార్టీ నేత జితన్ రామ్ మాంఝీకీ బెర్త్ ఖరారైనట్లు తెలిసింది. కొత్త ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతిస్తున్నాయని, వారు నూతన ప్రభుత్వంలో భాగస్వాములు కాకపోవచ్చని ఆర్జేడీ సీనియర్ నేత అభిప్రాయపడ్డారు.

సంక్షేమ హాస్టళ్ల సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీలు చేయించానని, మనం చేయాల్సింది చాలా ఉందని, దీనిపై ఒక కార్యాచరణ తేవాలని అన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ పరిధిలో నాడు-నేడు కింద తొలిదశలో స్కూళ్లను అభివృద్ధి చేశామని, మొదటి దశలో చేసిన పాఠశాలలకు అదనపు తరగతి గదులు నిర్మించే పనికూడా జరుగుతోందన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను ఇదే తరహాలో అభివృద్ధి చేయాలని చెప్పారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లను, గురుకులాలను ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనుల్లో అధికారుల ముద్ర స్పష్టంగా కనిపించాలని చెప్పారు. అభివృద్ధి పనులు చేశాక, వాటి నిర్వహణ కూడా బాగా చేసేలా దృష్టిపెట్టాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల సమగ్రాభివృద్ధి, నిర్వహణ కోసం ఇప్పుడున్న మొత్తాన్ని పెంచాలని ఆదేశించారు. పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి ఎంత కావాలో నిర్ణయించాలన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో అడుగులు ముందుకేయాలని సూచించారు.

హాస్టళ్ల నిర్వహణ నిధి ఏర్పాటు చేయాలి

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ నిధి ఏర్పాటు చేయాలని, ప్రతి హాస్టల్‌లోనూ తప్పనిసరిగా వార్డెన్లను నియమించాలని సీఎం జగన్ ఆదేశించారు. హాస్టళ్లలో కుక్, వాచ్‌మెన్ వంటి ఇతర సిబ్బంది కచ్చితంగా ఉండేట్టుగా చర్యలు తీసుకోవా లన్నారు. కుటుంబ వైద్యుడు తరహాగా, ఒక వైద్యుడు తప్పనిసరిగా సంక్షేమ హాస్టళ్ల బాగోగులపై దృష్టి సారించాలని చెప్పారు. డైట్ చార్జీలను పెంచి, విద్యా ర్థులకు మంచి ఆహారం అందించేలా చూడాలని, సమూలంగా డైట్ చార్జీలు పరిశీలించి, ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. గత ప్రభుత్వం కేవలం ఎన్నికలకు ముందు డైట్ చార్జీలను పెంచిందన్నారు. అద్దె ప్రాతిపదికన ఉన్న వసతి గృహాలను వెంటనే పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించా రు. అలాంటి చోట్ల నాడు-నేడు కింద వచ్చే ఏడాది శాశ్వత భవనాలను నిర్మించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రతి పనిలోనూ నాణ్యత తప్పనిసరిగా ఉండాలని, వాటికి అదనంగా కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను కూడా చేర్చాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, సీఎస్ సమీర్ శర్మ, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్.రావత్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బి.జయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.జాహ్నవి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

కాలిబాట కబ్జా...

కాసుల కక్కుర్తి

విశాలాంధ్ర - పరవాడ:

జీవీఎంసీ జోన్-6లోని 79వ వార్డు లంకెలపాలెంలో మాస్టర్ ప్లాన్ రహదారిని లైసెన్స్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)తో కుమ్మక్కై టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (టీపీబీవో) మరుగుపర్చిన విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఏసీబీ అధికారులు టౌన్‌ప్లానింగ్ విభాగం అక్రమాలకు, అవినీతికి కేంద్ర బిందువుగా మారిందని ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ టీపీబీవో హేమంత్ లెక్కచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆదాయం లక్షలు దాటుతున్నప్పుడు ఏసీబీ అయితే నాకేంటి అన్న చందంగా ఆయన ప్రవర్తన ఉందంటూ తోటి సిబ్బందే గుసగుసలాడుతున్నారు. తప్పుడు సమాచారమివ్వడం, సమాచారాన్ని మరుగునపర్చడం నేరమని ఎల్‌టీపీలకు సమావేశాలు పెట్టి మరీ చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ) మొరపెట్టుకున్నా ఫలితం కానరావడం లేదు. కొంతమంది ఎల్‌టీపీలు ఒక లైసెన్స్ బ్లాక్ చేస్తే మరో బినామీ లైసెన్స్ పక్కనే ఉందన్న ధీమాతో చెలరేగిపోతున్నారు. సొంత లైసెన్స్ బ్లాక్ అయినా సంతోషంగా పక్కవారి లాగిన్‌లో ప్లాన్‌లు పెట్టేస్తూ అక్రమాలకు తెగబడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొంత ఆదాయం కోసం అనేక అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల్లో ఉన్న అవకాశాలను తమకు అనుకూలంగా మలుచుకొని అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా జోన్-6లోని 79వ వార్డు

లంకెలపాలెంలో జరుగుతున్న పలు అక్రమాలను ఉదహరిస్తున్నారు. లంకెలపాలెం పరవాడ ఫార్మాసిటీ రహదారిని ఫార్మా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) 2041 మాస్టర్‌ప్లాన్‌లో 75 మీటర్ల రహదారిగా పేర్కొంది. 2021 ఉడా మాస్టర్‌ప్లాన్‌లో ఈ రహదారి 80 మీటర్లుగా ఉండేది. అయితే దీన్ని 75 మీటర్లుకు తగ్గించారు. ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపులా 32.5 మీటర్ల లోపు ఎటువంటి భవన నిర్మాణాలకు అనుమతించరు. మాస్టర్‌ప్లాన్‌లో లంకెలపాలెం రెవెన్యూ సర్వేనెంబర్ 134/7 పూర్తిగా ఎఫెక్ట్ అవుతున్నట్టు చూపారు. అదే సబ్‌డివిజన్‌కు ఎల్‌టీపీ ప్లాన్ పెట్టగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో) అనుమతించడం హాట్ టాఫిక్‌గా మారింది. అయితే మాస్టర్‌ప్లాన్ రహదారిని మరుగున పరిచి ప్లాన్‌లో చూపిన రహదారి మాత్రం గెడ్డవాగులో ఉందన్న అనుమానంతో టౌన్ సర్వేయర్‌కు టీపీబీవో రిఫర్ చేయడం కొంతలో కొంత హర్షణీయంగా చెబుతున్నారు. రహదారిని సైతం సైట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌లో టెన్‌టేటివ్(తాత్కాలికం) అని పేర్కొన్నారు. జీవీఎంసీకి ఫ్రీ గిఫ్ట్‌డీడ్‌గా విడిచిన స్థలం 16.98 చదరపు మీటర్లను, సెట్‌బ్యాక్‌లు, వెనకున్న పాత్‌వే (కాలిబాట) స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతివ్వడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రీన్‌స్ట్రిప్ సైతం అక్రమణకు గురైంది. అలాగే 100 చదరపు మీటర్లు దాటిన భవన అనుమతులు ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షించాల్సి ఉంటుంది. అనుమతించిన ప్లాన్ ప్రకారం భవనం వెడల్పు 2.69 మీటర్లు మాత్రమే. వాస్తవ భవనం వెడల్పు 4 మీటర్లు దాటినా చర్యలు శూన్యం. 75 మీటర్ల మాస్టర్‌ప్లాన్ రహదారిని చూపితే కనీసం మూడు మీటర్లు సెట్‌బ్యాక్ చూపాల్సి ఉంటుంది. ప్లాన్ మంజూరుకు వీలుకాదు. దీని దృష్ట్యా ఎల్‌టీపీ మాస్టర్‌ప్లాన్ రహదారిని మరుగున పెట్టినట్టు చెబుతున్నారు. సబ్‌ప్రెషన్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద ఎల్‌టీపీ లైసెన్స్ రద్దు చేయాలని చాలామంది డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్లాన్‌కు విరుద్ధంగా, గెడ్డ, కాలిబాటపై జరిగిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీకి దిక్కెవరు?

(మొదటిపేజీ తరువాయి)

సహా ఐదుగురు సభ్యులున్నారు. హరివంశ్ పార్టీ జేడీ(యూ) కేంద్రంలోని అధికార కూటమి నుంచి వైదొలగడంతో ఇప్పుడు ఆయన భవితవ్యంపై అస్పష్టత నెలకొంది.

అయితే సీపీఎం నుంచి బహిష్కరణ తర్వాత కూడా సోమ్‌నాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా కొనసాగారు. లోక్‌సభలో జేడీ(యూ)కు 16 మంది ఎంపీలున్నారు. కానీ దిగువ సభలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉంది. కాషాయ పార్టీకి 91 మంది సభ్యులు మాత్రమే ఉన్న రాజ్యసభలో బీజేపీకి సొంత మెజార్టీ లేదు. దీనికి ఇద్దరు స్వతంత్రులు, ఏఐఏడీఎంకే (నలుగురు ఎంపీలు)తో సహా మొత్తం 110 మంది ఎంపీల మద్దతు ఉంది. 245 మంది సభ్యుల సభలో సాధారణ మెజార్టీకి బీజేపీకి 123 మంది మద్దతు అవసరం. అధికార పార్టీకి మరో ముగ్గురు స్వతంత్రులు, అలాగే బీజేడీ లేదా వైసీపీ మద్దతు అవసరం ఉంటుంది. బిజూ జనతాదళ్ (బీజేడీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) రాజ్యసభలో చెరొక తొమ్మిదిమంది ఎంపీలను కలిగి ఉన్నాయి. ఇటీవల కాలంలో కీలక బిల్లుల ఆమోదం కోసం అధికార పార్టీకి వారు తమ మద్దతును అందించారు.

కాగా ఎన్‌డీఏకి మిత్రపక్షాలుగా ఉన్న ప్రాంతీయ పార్టీలకు చెందిన మరో 8 మంది ఎంపీలలో ఆర్‌పీఐ-ఎకి చెందిన రామదాస్ అతవాలే, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్‌కి చెందిన హిషే లంచుగ్పా, అసోం గణపరిషత్ (ఏజీపీ)కు చెందిన బీరేంద్ర ప్రసాద్ బైశ్యా, పట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) సభ్యుడు అన్బుమణి రామదాస్, తమిళ మనీలా కాంగ్రెస్ (మూపనార్)కు చెందిన జీపీ వాసన్, నేషనల్ పీపుల్స్ పార్టీకి చెందిన వాన్‌వీరోయ్ ఖర్లూఖి, మిజో నేషనల్ ఫ్రంట్‌కు చెందిన కె.వన్‌లాల్వేనా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ (లిబరల్)కు చెందిన రంగ్వ్రా నార్జారీ కూడా బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. అంతేకాకుండా, ఇద్దరు స్వతంత్ర ఎంపీలు అసోం నుంచి అజిత్ కుమార్ భుయాన్, హరియాణా నుంచి కార్తికేయ శర్మ కూడా అధికార ఎన్‌డీఏలో ఉన్నారు.

వరవరరావుకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఈ కేసులో ఛార్జ్‌షీటు దాఖలు చేసినప్పటికీ, ఇంకా కొంతమంది నిందితులను పట్టుకోలేదని, కోర్టులో ఉన్న నిందితులపై అభియోగాలను రూపొందించే అంశాన్ని తీసుకోలేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. నిందితులు డిశ్చార్జ్ కోరుతూ దాఖలు చేసిన వివిధ దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నాయని న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం తెలిపింది. 'ఇంతకుముందు మంజూరు చేసిన బెయిల్ సౌకర్యాన్ని ఉపసంహరించేంతగా అప్పీలుదారు (రావు) వైద్య పరిస్థితి కొంత కాలంగా మెరుగుపడలేదు' అని పేర్కొంది. 'పరిస్థితుల సంపూర్ణతను పరిగణనలోకి తీసుకుంటే, మా దృష్టిలో అప్పీలుదారు వైద్యపరమైన కారణాలపై బెయిల్ నుంచి ఉపశమనం పొందేందుకు అర్హులు' అని ధర్మాసనం వివరించింది. తెలుగు కవి అయిన వరవరరావు వైద్య కారణాలతో శాశ్వత బెయిల్ కోసం తాను చేసిన అభ్యర్థనను తిరస్కరిస్తూ బాంబే హైకోర్టు ఏప్రిల్ 13న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేశారు. ఈ కేసు డిసెంబర్ 31, 2017న పూణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సభలో చేసిన ప్రసంగాలకు సంబంధించిన ఆరోపణలతో కూడినది. మరుసటి రోజు పశ్చిమ మహారాష్ట్ర నగర శివార్లలోని కోరెగావ్-భీమా యుద్ధ స్మారక చిహ్నం సమీపంలో హింసను ప్రేరేపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మావోయిస్టులతో సంబంధాలున్న వ్యక్తులే ఈ సభను నిర్వహించారని పూణే పోలీసులు తెలిపారు. ఆ తర్వాత జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేపట్టింది. వరవరరావును ఆగస్టు 28, 2018లో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద జనవరి 8, 2018న పూణే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేసులో వరవరరావు విచారణ ఖైదీగా ఉన్నారు. రావుకు బెయిల్ మంజూరు చేస్తూ, క్రింది కోర్టు నుంచి అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై ప్రాంతాన్ని విడిచిపెట్టరాదని సుప్రీం కోర్టు పేర్కొంది. అప్పీలుదారు తన స్వేచ్ఛను ఏ విధంగానూ దుర్వినియోగం చేయకూడదు లేదా సాక్షులలో ఎవరితోనూ సంప్రదించకూడదు లేదా దర్యాప్తు ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించకూడదు' అని తెలిపింది. బెయిల్ ప్రయోజనం రావుకు అతని వైద్య పరిస్థితిపై మాత్రమే వర్తిస్తుందని, ఆదేశాల్లో చేసిన ఏవైనా పరిశీలనలు పార్టీలు పేర్కొన్న అర్హతలు లేదా ప్రత్యర్థి వివాదాలకు ప్రతిబింబంగా పరిగణించబడవని బెంచ్ స్పష్టం చేసింది. వాదనల సందర్భంగా, రావు తరపున హాజరయిన సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్, అతని వైద్య పరిస్థితిని ప్రస్తావిస్తూ, ఈ కేసులో అభియోగాలు కూడా నమోదు చేయలేదని చెప్పారు. ఎన్ఏఐ తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు... ఈ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. లోతైన మూలాధారమైన కుట్రలో రావు ప్రమేయం ఉన్నట్లు రికార్డులో ఉన్న అంశాలు చూపిస్తున్నాయని, బెయిల్ నుంచి ఉపశమనం పొందే అర్హత అతనికి లేదని వాదించారు. నిందితుడు దేశానికి వ్యతిరేకంగా తీవ్రమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఆయన వాదించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రావుకు మంజూరైన మధ్యంతర ఉపశమనం కొనసాగుతుందని సుప్రీం కోర్టు గతంలో పేర్కొంది. హైకోర్టు ఏప్రిల్ 13 నాటి ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన తన పిటిషన్‌లో రావు తాను విచారణ ఖైదీగా రెండేళ్ల పాటు జైలు శిక్షను అనుభవించానని చెప్పారు.

సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ లలిత్ భాగస్వామి. ఆయన సీజేఐ అయితే బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై అనంతరం సీజేఐ అయిన రెండో వ్యక్తి అవుతారు. 1971 జనవరిలో 13వ భారత ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ ఎస్.ఎం.సిక్రీ నేరుగా సుప్రీంకోర్టు జడ్జి అయిన మొదటి న్యాయవాది. 1964లో ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ ఎన్‌వీ రమణ ఈ నెల 26న పదవీ విరమణ చేసిన మరుసటి రోజున (ఆగస్టు 27న) జస్టిస్ యు.యు.లలిత్ సుప్రీంకోర్టు 49వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 1957 నవంబరు 9న జన్మించిన జస్టిస్ లలిత్ 1983 జూన్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 1985 డిసెంబరు వరకు బోంబే హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. 1986 జనవరి నుంచి ప్రాక్టీసును సుప్రీంకోర్టుకు మార్చారు. 2014 ఆగస్టు 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి అనేక కీలక తీర్పుల్లో భాగస్వామి అయ్యారు.

విమాన టికెట్ ధరలపై పరిమితి ఎత్తివేత

న్యూదిల్లీ: విమాన టికెట్ ధరలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ మార్గాల్లో విమాన ఛార్జీలపై పరిమితులను తొలగించింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బుధవారం ట్విటర్ వేదికగా వెల్లడించారు. ఈ నిర్ణయం ఆగస్టు 31 నుంచి అమల్లోకి రానుంది. అంటే ఇకపై, ప్రయాణికుల ఛార్జీలపై విమానయాన సంస్థలే స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చు. విమాన ఇంధన ధరలు, రోజువారీ ప్రయాణికుల డిమాండ్ వంటి అంశాలను విశ్లేషించిన అనంతరం విమాన ఛార్జీలపై పరిమితులను తొలగించాలని నిర్ణయించినట్లు పౌరవిమానయాన మంత్రి సింధియా తెలిపారు. పౌరవిమానయాన రంగంలో స్థిరీకరణ మొదలైందని, రానున్న రోజుల్లో దేశీయంగా ఈ రంగం మరింత వృద్ధి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కోవిడ్ కారణంగా రెండు నెలలు లాక్‌డౌన్ తర్వాత 2020 మే నెలలో దేశీయ విమాన సేవలు తిరిగి ప్రారంభమైనప్పుడు.. దేశీయ మార్గాల్లో ఛార్జీలపై కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను విధించిన విషయం తెలిసిందే. తక్కువ ఛార్జీల వల్ల విమానయాన సంస్థలు నష్టపోకుండా, గిరాకీకి అనుగుణంగా సంస్థలు భారీగా ఛార్జీలు పెంచకుండా చూడటం ద్వారా ప్రయాణికులకు ఊరట కలిగించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణ సమయాన్ని బట్టి వీటిని నిర్ణయించారు. 40 నిమిషాల్లోపు వ్యవధి ఉండే ప్రయాణాలకు రూ.2,900-8800 (జీఎస్‌టీ మినహాయించి) ఛార్జీ నిర్ణయించారు. అయితే, ఇప్పుడు విమానయాన రంగం క్రమక్రమంగా కోలుకుంటోంది. ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఛార్జీలపై పరిమితులను ఎత్తివేస్తున్నట్లు పౌర విమానయాన శాఖ ప్రకటించింది. కొత్త నిర్ణయం ఆగస్టు 31 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే, విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టు యాజమాన్యాలు కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ప్రయాణ సమయాల్లో ప్రజలు నిబంధనలు పాటించేలా చూసుకోవాలని ఆదేశించింది. కొంతకాలంగా, విమాన ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. 2019-20లో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ. 53,000 కాగా.. ప్రస్తుతం రూ. 1.20 లక్షలకు చేరింది. కోవిడ్ ముందుతో పోలిస్తే ఈ ధర రెట్టింపు కావడంతో విమాన సంస్థలు భారీగా నష్టపోతున్నాయి.

చేతబడితో ప్రజా విశ్వాసం పొందలేరు

కాంగ్రెస్‌కు ప్రధాని చురకలు

పానిపట్‌లో ఐఓసీ ఇథనాల్ ప్లాంటు జాతికి అంకితం

పానిపట్ : మంత్రాలకు చింతకాయలు రాలవని ప్రధాని మోదీ కాంగ్రెస్‌కు చురకలు అంటించారు. ఈనెల 5న ధరల పెంపుకు వ్యతిరేకంగా నల్ల వస్త్రాలను ధరించి పార్లమెంటుకు రావడాన్ని ఉద్దేశించి 'చేతబడి'తో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరు అని కాంగ్రెస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. మోదీ బుధవారం రూ.900 కోట్ల విలువ చేసే ఇండియా ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రెండవ తరం ఇథనాల్ ప్లాంట్‌ను జాతికి అంకితమిచ్చారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు గుప్పించారు. ఉచితాలాధారిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటి వల్ల దేశానికి నష్టం జరుగుతుందని, కొత్త పరిజ్ఞానంలో పెట్టుబడులను దెబ్బతీస్తుందని వ్యాఖ్యానించారు. 'ఆగస్టు 5న కొందరు 'చేతబడి' చేసేందుకు యత్నించారు. నల్ల వస్త్రాలను ధరించడం వల్ల నిస్పృహను దూరం చేసుకోలేరు. మంత్రాలు, చేతబడి, మూఢనమ్మకాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందలేరని వాళ్లకు తెలియదు పాపం' అంటూ కాంగ్రెస్‌నుద్దేశించి మోదీ వ్యంగాస్త్రాలు సంధించారు.



ఏడెనిమిదేళ్లలో రూ.50వేలకోట్ల ఫోరెక్స్ ఆదా

పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలపడం ద్వారా ఏడెనిమిదేళ్లలో రూ.50వేల కోట్ల ఫోరెక్స్ ఆదా అయిందని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. అంతే మొత్తం రైతులకు వెళ్లిందన్నారు. పంట వ్యర్థాలను తగలబెట్టే సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. హరియాణా, దిల్లీలో కాలుష్య సమస్యను పానిపట్ ఇథనాల్ ప్లాంట్ తగ్గిస్తుందని అన్నారు. రెండు లక్షల టన్నుల వరిగడ్డి ద్వారా మూడు కోట్ల లీటర్ల ఇథనాల్ ఏటా ఉత్పత్తి అవుతుందని చెప్పారు. గ్రీన్‌హౌస్ ఉద్గారాలనూ తగ్గిస్తుందన్నారు. బయోఫ్యూయల్ (జీవ ఇంధనాలు) వినియోగం, ఉత్పత్తిని పెంచే చర్యలకు ఈ ప్లాంటు ద్వారా మరింత బలం పెరుగుతుందని చెప్పారు. తద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. శుద్ధ ఇంధనాల గురించీ మాట్లాడారు. మరికొన్నేళ్లలో 75శాతం ఇళ్లకు పైప్డ్ గ్యాస్ సరఫరా జరుగుతుందని మోదీ అన్నారు.

వృద్ధులకు రాయితీలను సమీక్షించండి

పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు

న్యూదిల్లీ: సీనియర్ సిటిజన్ రాయితీలను సమీక్షించాలని, కనీసం స్లీపర్ క్లాస్, ఏసీ 3-టైర్ రైలు ప్రయాణానికి 'అత్యవసరంగా' పునరుద్ధరించాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. ఆగస్టు 4న సమర్పించిన నివేదికలో రైల్వే స్టాండింగ్ కమిటీ సీనియర్ సిటిజన్‌లకు వారి రైల్వే చార్జీలలో 40 నుంచి 50 శాతం వరకు రాయితీని గతంలో మంజూరు చేశారని, అయితే కోవిడ్-19 సంక్షోభ సమయంలో ఆ పద్ధతిని నిలిపివేసినట్లు తెలిపింది. సీనియర్ సిటిజన్లు తమ రాయితీలను స్వచ్ఛందంగా వదులుకునేలా ప్రోత్సహించే 'గివ్ అప్' పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రిత్వ శాఖను కోరింది. మహమ్మారి దృష్ట్యా, అన్ని వర్గాల ప్రయాణికులకు (నాలుగు వర్గాల దివ్యాంగులు, 11 వర్గాల రోగులు, విద్యార్థులు మినహా) రాయితీని ఉపసంహరించుకున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తన చర్యల నివేదికలో పేర్కొంది. ప్రభుత్వం సమాధానం ప్రకారం, ప్రస్తుతానికి మహమ్మారి, కోవిడ్ ప్రోటోకాల్ దృష్ట్యా సీనియర్ సిటిజన్లకు రాయితీని ఉపసంహరించుకుంది. రైల్వేలు సాధారణ స్థితికి చేరుకుంటున్నందున, వివిధ వర్గాల ప్రయాణికులకు మంజూరు చేసిన రాయితీలను న్యాయంగా పరిగణించాలని కమిటీ అభిప్రాయపడింది. 'సీనియర్ సిటిజన్లకు కోవిడ్‌కి ముందు కాలంలో ఉన్న రాయితీని సమీక్షించి, కనీసం స్లీపర్ క్లాస్, ఏసీ 3-టైర్‌లలో అత్యవసరంగా పరిగణించాలని కమిటీ కోరుతోంది. తద్వారా బలహీనమైన, నిజంగా అవసరమైన సీనియర్ సిటిజన్‌లు ఈ తరగతులలో సదుపాయాన్ని పొందగలరు' అని బీజేపీ నేత రాధా మోహన్ సింగ్ నేతృత్వంలోని కమిటీ పేర్కొంది. సీనియర్ సిటిజన్ రాయితీల కోసం రైల్వే శాఖ ఏటా దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తోంది.



తుంగభద్ర డ్యామ్

శ్రీశైలం డ్యామ్

పోటెత్తిన వరద

విశాలాంధ్ర-శ్రీశైలం:ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి కృష్ణా నదికి వరద పోటెత్తడంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. దీంతో 10 గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.807 టీఎంసీ) కాగా ప్రస్తుతం 884.30 (211.47 టీఎంసీ) అడుగులుగా ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేసి, 62 వేల 408 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలానికి 3,72,629 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, స్పిల్‌వే ద్వారా 2,77,080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తుంగభద్ర డ్యామ్ 33 గేట్లు ఎత్తివేత

విశాలాంధ్ర-హోలాగుంద: తుంగభద్ర డ్యామ్ వద్ద కృష్ణా నది పరవళ్లు తొక్కుతుంది. డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లోకి 1,43,577 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు డ్యామ్ స్పిల్‌వే 33 గేట్లను ఎత్తివేసి 1,64,090 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలారు. 28 గేట్లను నాలుగు అడుగుల మేర ఐదు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి వరద నీటిని నదిలోకి వదులుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వివరించారు.

డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు కాగా 1631 అడుగుల మేర నీరు చేరింది. రాయ బసవ కెనాల్‌కు 135 క్యూసెక్కులు, ఎల్‌బిఎంసికి 4,145 క్యూసెక్కులు, జిందాల్ కు 60 క్యూసెక్కులు, పవర్ కెనాల్‌కు 2,917 క్యూసెక్కులు హెచ్‌ఎల్‌సికి 3,309 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. గత ఇరవై రెండు రోజుల నుండి తుంగభద్ర డ్యామ్‌కు భారీ స్థాయిలో వరద నీరు వస్తోంది. దీనిపై బళ్లారి, కర్నూలు, రాయచూరు, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల కలెక్టర్లను బోర్డు అధికారులు అప్రమత్తం చేశారు. తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఆయకట్టు రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ నిండడం వల్ల సాగు, తాగు నీరు, విద్యుత్ సమస్య లేకుండా పోయిందని అధికారులు పేర్కొన్నారు.

కృష్ణా, గోదావరికి వరదలు వచ్చే అవకాశం

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి రెండోసారి, కృష్ణా నదికి తొలిసారి వరదలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు వెల్లడించారు. బుధవారం విజయవాడ జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అంబటి మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ సూచించారన్నారు. ఇప్పటికే జలవనరుల శాఖ వరదలకు సంబంధించిన నివేదిక తెప్పించుకొని ముందస్తు చర్యల్లో భాగంగా ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్లకు ప్రభుత్వం సూచించిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని శ్రీశైలం, పులిచింతల తదితర ప్రాజెక్టులన్నీ నిండుకుండలా కళకళలాడుతున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అనేక దుష్ప్రచారాలు వెలువడుతున్నాయని, ప్రజలు వాటిని నమ్మవద్దని చెబుతూ అందుకు గల కారణాలను విశ్లేషించారు. జులై 31లోగా లోయర్ కాఫర్ డ్యాం పనులు పూర్తిచేయమని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆదేశించిన మాట వాస్తవమేనన్నారు. స్పిల్ వే పూర్తిచేయకపోవడం వల్ల పోలవరం ప్రాజెక్టు వద్ద భయంకరమైన నీటి గుంటలు ఏర్పడటమే గాకుండా ప్రస్తుత వరదల వల్ల డయాఫ్రంవాల్ మునిగి పనులేవీ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు.

గత ప్రభుత్వ నిర్ణయాలతో భారీగా నష్టం వాటిల్లడమేగాకుండా ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతోందన్నారు. ఇప్పటికే డిజైన్ల విషయంలో ఆలస్యమైందని, వర్షాలు, వరదల ధాటికి ఏర్పడ్డ గుంటలను పూడ్చేందుకు జియోబ్యాగ్స్ ను యుద్ధ ప్రాతిపదికన తెప్పించి వాటిని పూడ్చే కార్యక్రమం చేపట్టామని వివరించారు. కొందరు ప్రభుత్వంపై దురుద్దేశపూర్వకంగా దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని, అవి అన్నీ అవాస్తవాలని మంత్రి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును చిత్తశుద్ధితో పూర్తి చేస్తుందని పునరుద్ఘాటించారు.

నేడు జగనన్న విద్యా దీవెన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న విద్యా దీవెనలో భాగంగా మూడు నెలలకుగాను 11.02 లక్షల మంది విద్యార్థులకు రూ.694 కోట్లు సీఎం జగన్ గురువారం బాపట్లలో బటన్ నొక్కి నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రమం తప్పకుండా మూడు నెలల ఫీజు చెల్లింపులు చేపడతారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనకు ఎలాంటి పరిమితులు లేవు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందిని చదివించవచ్చు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, వైద్యవిద్య తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుల మొత్తాన్ని ప్రతి మూడు నెలలు ముగిసిన వెంటనే తల్లుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేయనుంది. భోజన, వసతి ఖర్చులకు ఇబ్బంది పడకుండా ఏటా రెండు వాయిదాలలో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ. 15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించేవారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

గ్రూప్ 1, 2 నోటిఫికేషన్ విడుదల చేయాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా గ్రూప్ 1, 2 ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. విజయవాడ హనుమాన్‌పేట దాసరిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 2500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేయాలన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారనీ, లక్షల రూపాయలు వెచ్చించి ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుం టున్నారని, నోటిఫికేషన్లు ఆలస్యం చేయడంతో అనేకమంది వయోపరిమితి దాటిపోయి శాశ్వత నిరుద్యోగులుగా మిగిలిపోయే పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగాల ప్రకటన రాదనే భయంతో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా ఆలోచించాలని, లేకుంటే విద్యార్థి యువజన సంఘాలు, ప్రజాసంఘాలను ఏకంచేసి పోరాడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా గోవిందరాజులు, పెయ్యల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

'గోరంట్ల' వీడియో రగడ

- 'ఒరిజినల్' కాదన్న అనంతపురం ఎస్పీ
- యూకే నుంచి పోస్టు చేశారని వెల్లడి
- తప్పుపట్టిన నారా లోకేశ్
- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ నగ్న వీడియో వ్యవహారంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వీడియోపై రాజకీయంగా దుమారం రేగింది. కులాల మధ్య దూషణలు చేసుకునే పరిస్థితి వచ్చింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో ఈ నగ్న వీడియోపై 'ఒరిజనల్' దొరికితేనే స్పష్టత వస్తుందంటూ అనంతపురం ఎస్పీ ఫకీరప్ప బుధవారం తేల్చిచెప్పారు. కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో క్లిప్పింగ్, ఒరిజనల్ అని నిర్ధారణకు రాలేకపోతున్నామని, వీడియోను మార్ఫింగ్/ఎడిటింగ్ చేసి ఉండొచ్చని చెప్పారు. వీడియోకు సంబంధించి బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని, వీడియోని మార్ఫింగ్ చేసినట్లు ఎంపీ అనుచరులు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఈ నెల నాలుగో తేదీ అర్ధరాత్రి 2.07 గంటలకు ఒక నంబరు నుంచి వీడియోను పోస్ట్ చేశారని, అది యూకే వొడాఫోన్‌కు సంబంధించినదిగా గుర్తించామన్నారు. ఎంపీ వీడియో మొదట ఐ-టీడీపీ వాట్సాప్‌లో షేర్ అయిందని, అసలు వీడియో ఎవరి వద్దనైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఒరిజినల్ వీడియో ఉంటేనే ఫోరెన్సిక్ నివేదిక వస్తుందని స్పష్టం చేశారు. ఈ వీడియో వ్యవహారంపై ఎంపీ గోరంట్ల స్వయంగా ఫిర్యాదు చేయలేదని కూడా ఎస్పీ చెప్పారు. సదరు వీడియోను వేరే మొబైల్ ద్వారా చిత్రీకరించారని, ఒరిజనల్ వీడియో దొరికే వరకూ దానిపై ఏమీ చెప్పలేమంటూ స్పష్టం చేశారు. ఇదిలా వుండగా, గోరంట్ల వీడియో... విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు వచ్చిందంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనిపై పోలీసు యంత్రాంగం అధికారికంగా వెల్లడించలేదు.

పరువు నష్టం దావా వేస్తా: గోరంట్ల మాధవ్

కొంత మంది దుర్మార్గులు కావాలనే వీడియో మార్ఫింగ్ చేశారని, వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఎంపీ గోరంట్ల మాధవ్ చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టటానికే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఈ రాద్ధాంతానికి తెరదించాలని, నకిలీ వీడియో సృష్టించిన వారిపై పరువునష్టం దావా వేస్తానని చెప్పారు.

అనంత ఎస్పీ ఫోరెన్సిక్ నిపుణుడా? లోకేశ్

అనంతపురం ఎస్పీ ఏమైనా ఫోరెన్సిక్ నిపుణుడా అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశ్నించారు. ఎంపీ గోరంట్ల వీడియోపై వాస్తవాలను ప్రజలే తేలుస్తారన్నారు. మాధవ్ వీడియోపై అనంతపురం ఎస్పీ వివరణను ఆయన తప్పుపట్టారు.

వీడియో వైరల్‌పై విభిన్న ప్రకటనలు

గోరంట్ల వీడియో వైరల్‌పై హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... మాధవ్ వీడియోను ఫోరెన్సిక్‌కు పంపామని, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అటు గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఉదాసీనత చూపుతోందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. గోరంట్లను ప్రభుత్వం, వైసీపీ పెద్దలు వెనకేసుకొస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. గోరంట్ల మాధవ్ వ్యవహారంపై సీఎం జగన్ మందలించి ఉంటే మిగిలిన వారికి భయం ఉండేదని, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకుగాను కుల, మతాలను అడ్డంపెట్టుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించిన విషయం విదితమే.

ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర -పోలవరం: జిల్లాలో గోదావరి వరదల కారణంగా సంభవించిన నష్టాలను అంచనా వేసేందుకు ముగ్గురు సభ్యుల కేంద్ర బృందం బుధవారం పోలవరం చేరుకుంది. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బృందానికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం బృందం సభ్యులు సీడబ్ల్యూసీ కార్యాలయం వద్ద నెక్లెస్ బండ్ ప్రాంతాన్ని సందర్శించారు. వరద నష్టాలపై పోలవరంలో సమాచారశాఖ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. జిల్లాలో వరద నష్టాన్ని కలెక్టర్ బృందానికి వివరించారు. యడ్లగూడెంలో గోదావరి గట్టును పరిశీలించారు. పోలవరం నుంచి వేలేరుపాడు బయలుదేరి వెళ్లారు. కేంద్ర బృందంలో హైదరాబాద్‌లోని కేంద్ర వ్యవసాయం, సహకార, రైతు సంక్షేమ శాఖ జ్యూట్ విభాగం డైరెక్టర్ కె. మనోహరన్, కేంద్ర జలసంఘంలోని జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రాంతీయ డైరెక్టర్ పి.దేవేందర్, ఢిల్లీకి చెందిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్ సోని సభ్యులుగా ఉన్నారు.

నా భద్రతా సిబ్బందిపై ఆంక్షలా: పయ్యావుల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తన భద్రతకు భంగం వాటిల్లేలా ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరిస్తోందనీ, భద్రతా సిబ్బందిపై ఆంక్షలు పెడుతోందని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కీలక విషయాలను ప్రస్తావిస్తున్నానని తనను లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని, భద్రతా సిబ్బంది హైదరాబాద్‌లో ఉండకూడదంటూ మూడు నెలల నుంచి విచిత్ర వాదన లేవనెత్తారని తెలిపారు. పొరుగు రాష్ట్రాలకు భద్రతా సిబ్బందిని ఇచ్చేదే లేదని చెబుతున్నారన్నారు. వైసీపీ నేతలు హైదరాబాద్‌లో భద్రతా సిబ్బందితో ఎలా ఉంటున్నారంటూ ప్రశ్నించారు. గన్ లైసెన్సుకు ఆల్ ఇండియా పర్మిట్ కావాలంటే నాలుగు నెలలుగా నిలిపివేశారని అన్నారు. తన నియోజకవర్గంలో మాజీ మిలిటెంట్ల కదలికలు పెరిగాయని, పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పనిచేసిన మాజీ నక్సలైట్లు తిరుగుతున్నారని వివరించారు. తాను వెలుగులోకి తెస్తున్న విషయాలు, రాసిన లేఖలు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నాయేమోనన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. సిబ్బందిని పెంచాలంటూ నిఘా విభాగం ముఖ్యఅధికారిని అడిగిన మరుసటి రోజే, తన భద్రతా సిబ్బందిని మార్చడం అనుమానాలకు తావిస్తోందని

ఏపీఈసెట్‌లో 92.36 శాతం అర్హత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంజనీరింగ్ కోర్సుల్లో రెండో సంవత్సరం ప్రవేశాల కోసం డిప్లొమో విద్యార్థులకు నిర్వహించిన ఏపీఈసెట్-2022 ఫలితాలు విడుదలయ్యాయి. మంగళగిరి ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ఫలితాలను వెల్లడించారు. జులై 22న జేఎన్టీయూ-కాకినాడ అధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. దాదాపు 37వేల మంది విద్యార్థులు హాజరవ్వగా, మొత్తం 33,657మంది (92.36 శాతం) అర్హత సాధించారు. బాలికలు ముందు వరుసలో నిలిచారు. బాలురు 91.44 శాతం, బాలికలు 95.68శాతం ఉత్తీర్ణులయ్యారు. 14 విభాగాల్లో జరగాల్సిన పరీక్షను, 11విభాగాల్లోనే నిర్వహించామని హేమచంద్రారెడ్డి తెలిపారు. వివిధ కోర్సులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు రానందున, వాటిని నిర్వహించలేకపోయామన్నారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే శ్యామలారావు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే వేగవంతం

మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష రీసర్వే'పై ఒకరోజు సదస్సును బుధవారం మంత్రి ప్రారంభించారు. ఆనంతరం మంత్రి మాట్లాడుతూ... మూడేళ్ల పాలనలో సీఎం జగన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. వందేళ్ల తర్వాత దాదాపు రూ.140కోట్ల ఖర్చుతో ఆధునిక సమగ్ర భూ సర్వే నిర్వహించి, ప్రజలకు భూ రికార్డులను ఉచితంగా ఇవ్వడం ద్వారా వైసీపీ ప్రభుత్వం చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. లేఅవుట్‌లు, భూముల సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ భూముల కబ్జాకు కాలం చెల్లిందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో భూ సర్వే చేపట్టి వేగవంతంగా పూర్తిచేశామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో నిర్ణీత కాలవ్యవధిలో సర్వే పూర్తిచేయాలని కోరారు. సర్వేలో భవనాలు, రోడ్లు, చెరువులు, కాలువలు, ఖాళీ స్థలాలు, వేటికవి ప్రత్యేకంగా గుర్తిస్తామన్నారు. ఇకపై ఏ సమస్యలు లేకుండా ఎవరి ఆస్తిపై వారికి అన్ని వివరాలతో కూడిన హక్కు పత్రం ఇచ్చేందుకు తమ ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టిందని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, అధికార, అభివృద్ధి వికేంద్రీకరణతో ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టంచేశారు.

పట్టాణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మాటాడుతూ... మరో ఆరు నెలల్లో భూ రీసర్వే పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా అధికారు లందరూ కృషి చేయాలన్నారు. ప్రతి వారం అధికారులు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీసీఎల్‌ఏ కమ్ సెక్రటరీ బాబు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జె. విద్యుల్లత, విజయవాడ నగర కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, వివిధ మునిసిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల కమిషనర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

14, 15 తేదీల్లో శివపురంలో సత్యాగ్రహం

545వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు ఆరోపించారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న ఉక్కు రిలే దీక్షలు బుధవారం నాటికి 545వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 14, 15 తేదీల్లో శివపురంలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలకు కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు మోదీ ఆపకపోతే కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి కూడా పడుతుందని హెచ్చరిం చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ ప్రాంతం పోరాటాల పురిటిగడ్డ అని, అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల అని, పోరాటాలద్వారానే విశాఖ ఉక్కు సిద్ధించిందన్న సంగతి గుర్తుంచుకో వాలన్నారు. 545, రోజులుగా అలుపెరుగని ఉద్యమాలు చేస్తున్నా ప్రజానీకం, కార్మికుల పోరాటాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లక పోవడం దురదృష్టకరమన్నారు. స్వయాన సీఎం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి ప్రధానితో మాట్లాడదామని హామీ ఇచ్చి 500 రోజులు గడిచినా అతీగతి లేదని విమర్శించారు. పోరాట కమిటీ సభ్యులు ఎన్ రామారావు , వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య , పీవీ రమణ మూర్తి .ఎమ్మెస్ రావు. వీడీవీ పూర్ణచంద్రరావు , డీ కృష్ణ మూర్తి, బీ సురేష్ కళ్యాణ్ ఎం. రాజు. కోటేశ్వరరావు, టీఎస్ ఎన్ వెంకటేష్, రామరాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిశోధనలకు నిధులు పెంచాలి

ఉస్మానియాలో సైన్సు సంఘాల ర్యాలీ

హైదరాబాద్: శాస్త్రీయ పరిశోధనలకు నిధులు పెంచాలని యునైటెడ్ సైన్స్ ఆర్గనైజేషన్‌లు కేంద్రాన్ని డిమాండు చేశాయి. ఈ మేరకు వివిధ సంస్థలు బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మార్చ్ ఫర్ సైన్స్ పేరుతో ర్యాలీ నిర్వహించాయి. దేశంలో అశాస్త్రీయమైన అంశాలు ఎక్కువగా ప్రచారం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. మూఢనమ్మకాలను వ్యతిరేకించాలని, శాస్త్రీయ విద్యను ప్రోత్సహించాలని నాయకులు నినాదాలు చేశారు. ఈ విషయంలో కేంద్రం సరైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అఖిల భారత అభ్యుదయ వేదిక, (ఏఐపీఎఫ్) జనవిజ్ఞాన వేదిక, ఏఐపీఎస్ఎన్, ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాల్సిన అవసరాన్ని కేంద్రం గుర్తించాలని, పరిశోధనలకు నిధులు పెంచాలని డిమాండు చేశాయి. 40 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏఐపీఎఫ్ నేత ప్రొఫెసర్ సోమ మర్ల, ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, ఓయూ యువ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్యన్, డాక్టర్ గంగాధర్, ఉస్మానియా విద్యార్థి సంఘం కార్యదర్శి ప్రతిభ తదితరులు ప్రసంగించారు.

పోలవరం ఆథారిటీ లేఖపై వివరణ ఇవ్వండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరదలకు ముందే జులై 31 నాటికి పోలవరం దిగువ కాఫర్ డ్యామ్ పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంపై పోలవరం అథారిటీ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై వివరణ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టత లేదన్నారు. ఏ కాంటూరు వద్ద ఎంత మునక ఉంటుందో లెక్క సరిగా కట్టనందున జులైలో వచ్చిన వరదలతో అమాయక గిరిజనులు వందలాది గ్రామాల్లో ఇప్పటికీ అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. ప్రాజెక్టు పూర్తికాకుండానే గ్రామాలు మునిగిపోయాయని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ లోపాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా వెల్లడైందని తెలిపారు. ఆగస్టు అంతా ప్రజలు అరిచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతకాల్సిన దుస్థితికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. డ్యామ్ నిర్మాణంపై వాదోపవాదాలతో కాలయాపన చేయకుండా, 2013 చట్ట ప్రకారం పూర్తిస్థాయి పునరావాసం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నీట్, జేఈఈకి ఉచిత శిక్షణ

'ఆకాష్' అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ కుమార్

విశాలాంధ్ర- విశాఖ సిటీ: సామాజిక చేయూతలో భాగంగా బాలికలు సాధికారత సాధించే దిశగా రెండువేల మంది విద్యార్థినులకు నీట్, జేఈఈలలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు 'ఆకాష్' ముందుకు వచ్చినట్టు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కే రాజేశ్ కుమార్ తెలిపారు. విశాఖలో బుధవారం 'ఆంతే-2022' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేశ్ మాట్లాడుతూ, బైజుస్ సంస్థతో కూడా ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా వేలాదిమంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లిస్తూ ఉన్నత విద్య అభ్యసించడానికి తగిన తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు విద్యార్థులకు తల్లిదండ్రులతో సహా 'నాసా' సందర్శనకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 33 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించామని వివరించారు. నవంబర్ 5 నుంచి 13 వరకు స్కాలర్‌షిప్ అర్హత పరీక్ష ఆన్‌లైన్‌లోనూ, 6, 13 తేదీల్లో ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహిస్తామని తెలిపారు. బైజుస్‌కు రాజేశ్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏరియా బిజినెస్ సెంటర్ హెడ్ వీ వేణుకృష్ణ, నాగేంద్ర భరద్వాజ్ పాల్గొన్నారు.

2024లో మోదీ గెలుస్తారా?

నితీశ్ వ్యంగ్యాస్త్రాలు

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్ ఉత్సాహంగా కనిపించారు. ఆయన 2024లో ప్రధాన మంత్రి అభ్యర్థి అని ఆర్జేడీ వ్యాఖ్యానించడంతో మరింత పొంగిపోయారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2014లో గెలిచారని, అయితే 2024 గురించి ఆయన ఇక ఆందోళన చెందవలసిందేనని నితీశ్ వ్యాఖ్యానించారు. మహాకూటమి ప్రభుత్వం బుధవారం ఏర్పాటైంది. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రిగా తేజస్వి యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఇద్దరూ పరస్పరం ఆత్మీయతను పంచుకున్నారు. నితీశ్‌కు పాదాభివందనం చేసేందుకు తేజస్వి ప్రయత్నించగా, నితీశ్ చిరునవ్వుతో అడ్డుకుని, కరచాలనం చేశారు. ఎన్డీయే నుంచి జేడీయూ తెగతెంపులు చేసుకుంది. నితీశ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ మహాకూటమి ప్రభుత్వం త్వరలోనే కుప్పకూలిపోతుందన్న బీజేపీ నేతల వ్యాఖ్యలపై స్పందించారు. తమ ప్రభుత్వం అద్భుతంగా నడుస్తుందని నితీశ్ ఆశాభావం వెలిబుచ్చారు. బీజేపీని వదిలిపెట్టాలని జేడీయూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకుందన్నారు. తన ప్రభుత్వం 2024 వరకు ఉన్నా, లేకపోయినా, వాళ్లు (బీజేపీ) తమకు కావాలనుకున్నది మాట్లాడవచ్చునన్నారు. తాను మాత్రం 2014లోనే ఉండిపోనని చెప్పారు. 2014లో మోదీ నేతృత్వంలో ఎన్డీయే విజయం సాధించిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. అంతకుముందు బీజేపీ నేత సుశీల్ మోదీ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ నితీశ్ కుమార్ నేతృత్వంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం తన పదవీ కాలం ముగియక ముందే (2025కు ముందే) పతనమవుతుందన్నారు.

ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ అనారోగ్య పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకుని ఆ పార్టీని చీల్చుతారని ఆరోపించారు. మాజీ కేంద్ర మంత్రి ఆర్‌సీపీ సింగ్ ద్వారా జేడీయూను చీల్చేందుకు బీజేపీ కుట్ర పన్నిందని జేడీయూ చేస్తున్న ఆరోపణలను సుశీల్ మోదీ తోసిపుచ్చారు. నితీశ్ కుమార్ అనుమతి తీసుకున్న తర్వాతే సింగ్‌కు కేంద్రమంత్రి పదవి ఇచ్చినట్లు తెలిపారు.

నితీశ్, తేజస్వీకి అఖిలేశ్ శుభాకాంక్షలు

లక్నో: బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జెడీ(యూ) నేత నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లకు సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. 'బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్‌జీ... ఉప ముఖ్యమంత్రిగాతేజస్వి యాదవ్‌జీ ప్రమాణ స్వీకారం చేసినందుకు హృదయపూర్వక అభినందనలు,శుభాకాంక్షలు' అంటూ ఆయన హిందీలో ట్వీట్ చేశారు.

కాంగ్రెస్‌కు నాలుగు మంత్రి పదవులు?

పాట్నా: నితీశ్ కుమార్ సారథ్యంలోని మహాకూటమి ప్రభుత్వంలో కాంగ్రెస్‌కు నాలుగు మంత్రి పదవులు దక్కనున్నాయి. బీజేపీతో సంబంధాలు తెంచుకున్న నితీష్ ఆ వెంటనే ఆర్జేడీ కూటమితో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సీఎంగా నితీశ్, ఉప ముఖ్యమంత్రిగా ఆర్జేడీ శాసనసభా పక్ష నేత తేజస్వి యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రివర్గ విస్తరణను త్వరలోనే నితీశ్ చేపట్టనున్నారు. నితీశ్ క్యాబినెట్‌లో నాలుగు మంత్రి పదవులతో పాటు స్పీకర్ పదవిని కాంగ్రెస్ ఆశించింది. అయితే, స్పీకర్ పదవి ఇచ్చేందుకు నితీశ్ సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో ఆర్జేడీకి అసెంబ్లీ స్పీకర్ పదవి దక్కనుంది. మాజీ సీఎం జితిన్ రామ్ మాంఝీ పార్టీ హెచ్‌ఏఎంకు ఒక మంత్రి పదవి దక్కనుంది. జేడీయూ దాదాపు గత మంత్రివర్గంలో ఉన్న మంత్రులనే కొనసాగించే అవకాశాలున్నాయి. నితీశ్ వద్దే హోం శాఖ ఉండనుంది. గత ప్రభుత్వంలో బీజేపీ నిర్వహించిన మంత్రి పదవులు ఆర్జేడీకి దక్కే అవకాశాలున్నాయని చెబుతున్నారు. బీహార్ అసెంబ్లీలో 243 మంది సభ్యులుండగా, జేడీయూకు 43, ఆర్జేడీ 79, సీపీఐ (ఎంఎల్)కు 12, సీపీఐ, సీపీఎంలకు చెరో ఇద్దరు ఎమ్మెల్యేల బలం ఉంది. బీజేపీకి 77 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

లాలూ ఇంట్లో దూరిన పాము

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్



న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్... నితీశ్‌కుమార్‌తో జట్టు కట్టడంపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. నితీశ్‌ను పాముగా అభివర్ణిస్తూ ఒకప్పుడు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే పాము లాలూ ఇంట్లోకి ప్రవేశించిందని ఎగతాళి చేశారు. 2017లో నితీశ్ కుమార్ ఆర్జేడీతో తెగదెంపులు చేసుకుని, మళ్లీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు లాలూప్రసాద్ స్పందిస్తూ... రెండేళ్లకోసారి చర్మాన్ని రాల్చే పాముగా నితీశ్‌ను అభివర్ణిస్తూ ట్వీట్ చేశారు. నితీశ్‌ను తరచుగా విమర్శించే గిరిరాజ్ సింగ్ బుధవారం లాలూ చేసిన ట్వీట్‌ను పంచుకుంటూ 'పాము మీ ఇంట్లోకి ప్రవేశించింది' అన్నారు. నితీశ్ కుమార్ తనను తాను ప్రధానమంత్రిగా భావించుకుంటున్నారని, ఆయన కోరిక... ప్రజల తీర్పును కాదని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవతలి వైపుకు వెళ్లేలా చేసిందని అన్నారు. సొంతంగా ముఖ్యమంత్రి కాలేని వ్యక్తి ప్రధానమంత్రి కావాలని కలలు కంటున్నారని గిరిరాజ్‌సింగ్ ఎద్దేవా చేశారు. నితీశ్‌కు ధైర్యం ఉంటే బీహార్ ప్రజలను తాజా తీర్పు కోరాలని సవాల్ చేశారు. బీజేపీ-జేడీ(యు) కలిసి ఉన్నప్పుడు కూడా నితీశ్ తీసుకున్న వివిధ నిర్ణయాలు, వివిధ సైద్ధాంతిక, హిందుత్వ సంబంధిత సమస్యలపై ఆయన వైఖరిని గిరిరాజ్‌సింగ్ అనేకసార్లు విమర్శించారు.

నితీశ్‌కు బీజేపీతో అసౌకర్యం: ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం సౌకర్యంగా లేదని, అందుకే ఆయన ఒక రాజకీయ నిర్మాణం నుంచి మరో రాజకీయానికి మారారని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బుధవారం అన్నారు. ఒకప్పుడు కుమార్‌కు సన్నిహితుడిగా భావించే కిశోర్... బీహార్‌లో రాజకీయ పరిణామాల ప్రభావం ప్రస్తుతం రాష్ట్రానికే పరిమితమై ఉంటుందని చెప్పారు. అవి స్వల్పకాలంలో జాతీయ స్థాయిలో ప్రభావం చూపే అవకాశం లేదని అన్నారు. '2017 నుంచి 2022 వరకు ఆయన బీజేపీతోనే ఉన్నారు. కానీ చాలా కారణాల వల్ల నేను అతనిని ఎప్పుడూ సుఖంగా చూడలేదు. మహాకూటమితో ప్రయోగాలు చేద్దామని ఆయన భావించి ఉండవచ్చు' అని కిశోర్ పాట్నాలో మీడియాకు తెలిపారు. కుమార్ ప్రధాన మంత్రి ఆశలు కలిగి ఉన్నారనే నివేదికలపై మాట్లాడుతూ పరిణామాలు కచ్చితంగా 'బీహార్ కేంద్రీకృతం' అని నొక్కి చెప్పారు. 2012-13 నుంచి బీహార్ ప్రభుత్వ ఏర్పాటులో ఆరు ప్రయోగాలు చేసిందని, నితీశ్ కుమార్ నిరంతరం ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని ప్రశాంత్ కుమార్ అన్నారు. '2012-13 నుంచి ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించినంతవరకు ఇది ఆరవ ప్రయోగం. ఈ ఆరు ప్రయోగాల్లోనూ నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. బీహార్‌లో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. కొత్త ప్రభుత్వం ఏదైనా మంచి చేస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. అవినీతి సహా అనేక అంశాల్లో ఆర్‌జేడీ, జేడీ(యూ) పరస్పర విరుద్ధమైన వైఖరిని కలిగి ఉన్నందున కొత్త ప్రభుత్వం పని చేస్తుందో లేదో చూడాలని అన్నారు.

ఉపరాష్ట్రపతిని చేయలేదనే..

ఎన్డీయేతో జేడీ(యూ) తెగతెంపులపై సుశీల్ మోదీ

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ఉపరాష్ట్రపతి చేయని కారణంగానే ఎన్డీయేతో జేడీ(యూ) తెగతెంపులు చేసుకున్నట్లు బీజేపీ ఎంపీ, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ వ్యాఖ్యానించారు. నితీశ్ ఢిల్లీకి వెళ్లి ఉప రాష్ట్రపతి అయితే మీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావచ్చు అని కొందరు జేడీ(యూ) నేతలు తన వద్ద ప్రతిపాదించారని నూతన సీఎంగా నితీశ్ ప్రమాణ స్వీకారానికి ముందు విలేకరులతో మాట్లాడిన సుశీల్ మోదీ ఆరోపించారు. ప్రధాని మోదీని, ఎన్డీయేకు ఓటు వేసిన బీహార్ ప్రజలను నితీశ్ అవమానించారని అన్నారు. తేజశ్వీయాదవ్ పాలనలో ఈ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూద్దాం.. వచ్చే ఎన్నికలకు ముందే కూలిపోవడం ఖాయం అని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్ తమతో తెగతెంపులు చేసుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయని, మహారాష్ట్ర పరిస్థితి రావచ్చు అని భయపడ్డారని సుశీల్ మోదీ చెప్పారు. మహారాష్ట్రలో శివసేనను చీల్చేందుకు బీజేపీ ప్రయత్నించలేదని అన్నారు. జేడీ(యూ)ని గుల్ల చేయాలని బీజేపీ చూస్తున్నట్లు వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. 'నితీశ్.. ఆర్జేడీకి ద్రోహం చేస్తారు. లాలూ ప్రసాద్ యాదవ్ అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకొని ఆ పార్టీని చీల్చేందుకు యత్నిస్తారు' అని సుశీల్ మోదీ ఆరోపణలు చేశారు.

పుల్వామాలో తప్పిన ప్రమాదం

పుల్వామా: జమ్మూకశ్మీరులోని పుల్వామాలో ఉగ్రవాదులు పేల్చడానికి సిద్ధంగా ఉంచిన 30 కిలోల పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పుల్వామా నగరంలోని తహబ్ క్రాసింగ్ సర్క్యులర్ రోడ్డుపై ఉంచిన 30 కిలోల పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు ధ్వంసం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పుల్వామాలో ఎల్ఈడీ పేలుడు పదార్థాలు ఉన్నాయని పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలకు కేంద్ర ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందింది. దీంతో పేలుడు పదార్థాలను బుధవారం ఉదయం ధ్వంసం చేయడంతో ఉగ్రవాదుల పేలుడు యత్నం విఫలమైంది.

22 నుంచి కేరళ అసెంబ్లీ సమావేశాలు?

తిరువనంతపురం: ఆగస్టు 22 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేరళ మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. సీఎం పినరయి విజయన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆమోదానికి పంపనున్నట్టు వెల్లడించింది. అసెంబ్లీ సమావేశాలు 10 రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం. కేరళ లోకాయుక్త (సవరణ) ఆర్డినెన్స్ సహా ఇతర ఆర్డినెన్సులపై గవర్నర్ సంతకాలు పెట్టకపోవడంతో వాటిని చట్టాలుగా మార్చేందుకు సమావేశాలు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కామన్వెల్త్ దేశాల సదస్సులో పాల్గొనేందుకు కెనడాకు వెళ్లాల్సిన స్పీకర్ ఎంబీ రాజేశ్ తన అధికారిక పర్యటనను రద్దు చేసుకున్నారు.

ప్రియాంక గాంధీకి కరోనా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కరోనా బారిన పడ్డారు. ఈ విషయాన్ని ఆమె ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు.తనకు రెండోసారి కోవిడ్ పాజిటివ్ రావడంతో హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు బుధవారం ఆమె ట్వీట్ చేశారు. ప్రియాంకకు కరోనా సోకడంతో ముందు జాగ్రత్తగా రాహుల్‌గాంధీ తన రాజస్థాన్ పర్యటనను రద్దు చేసుకున్నారు. బుధవారం ఆయన రాజస్థాన్‌లోని అల్వార్ నగరంలో జరగనున్న కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణా శిబిరానికి హాజరు కావల్సి ఉంది. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఇటీవల కరోనా బారినపడి కోలుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షులు పవన్ ఖేరా, ఎంపీ అభిషేక్ మను సంఘ్వీ కరోనా బారినపడ్డారు.

జెండా కొంటే రేషనా... సిగ్గు సిగ్గు: వరుణ్‌గాంధీ

చండీగఢ్: స్వపక్షంలో విపక్షం పాత్ర పోషిస్తున్న బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ కేంద్రం తీరుపై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ జెండాను బలవంతంగా రేషన్ దుకాణాల్లో అమ్ముతున్న వైనంపై వైరల్ అయిన ఒక వీడియో ఆధారంగా ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. 75వ స్వాతంత్ర్య వేడుకలు పేదలకు ఆర్థికభారంగా మారడం దురదృష్టకరమని పేర్కొంటూ ఆ వీడియోను తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. రేషన్‌కార్డుదారులు రూ.20తో జాతీయ జెండాను కొనుగోలు చేస్తే తప్ప రేషన్ సరుకులు ఇవ్వడం కుదరదని ఆ దుకాణం నిర్వాహకుడు చెబుతున్నట్టు ఆ వీడియోలో స్పష్టంగా వినిపిస్తోంది. బలవంతంగా రూ.20 తీసుకుని రేషన్ అందిస్తున్నట్టు తెలుస్తోంది. జెండా కొనుగోలు చేయకపోతే రేషన్ అందించవద్దని ప్రభుత్వం నుంచే ఆదేశాలు వచ్చాయని ఆ దుకాణం నిర్వాహకుడు చెబుతున్నాడు. ఈ వ్యవహారాన్ని వరుణ్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. పేదల కంచాన్ని లాగేస్తారా అంటూ కేంద్రాన్ని సూటిగా నిలదీశారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుని గుండెల్లో ఉందని పేర్కొన్నారు. పేదల ఆహారాన్ని జెండాతో వెలకట్టి లాగేసుకోవడం సిగ్గుచేటంటూ మండిపడ్డారు. ఆ వీడియో బీజేపీ పాలిత హరియాణాలోని కర్నాల్‌లో ఒక రేషన్ దుకాణం వద్ద రికార్డు అయింది.

గుజరాత్ మహిళలకు రూ.వెయ్యి భృతి: కేజ్రీవాల్

అహ్మదాబాద్: గుజరాత్‌లో తమ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ.1000 చొప్పున భృతి అందిస్తామని ఆమ్‌ఆద్మీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం హామీ ఇచ్చారు. అయితే తీసుకోడానికి 'వారికి ఇష్టమైతేనే' ఈ మేరకు సాయం అందిస్తామంటూ మెలిక పెట్టారు. ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కేజ్రీవాల్ ప్రజలకు ఇచ్చిన ఐదవ హామీ ఇది. 'రూ. 1,000 (నెలకు భృతి) ఉచితం కాదు... ఇది మీ హక్కు... ప్రజల సొమ్ము స్విస్ బ్యాంక్‌లో కాకుండా ప్రజల వద్దకే వెళ్లాలి' అని కేజ్రీవాల్ అన్నారు.

మిత్రపక్షాల అంతానికి బీజేపీ కుట్ర: పవార్

పూనె: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వివిధ రాష్ట్రాల్లోని తమ మిత్రపక్షాలనే నాశనం చేస్తోందని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. పూనె జిల్లాలోని బారామతి పట్టణంలో బుధవారం విలేకరులతో మాట్లాడిన శరద్ పవార్ బీహార్ రాజకీయ పరిణామాలపై స్పందించారు.

బీజేపీతో తెగతెంపులు చేసుకుంటూ నితీశ్ కుమార్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని చెప్పారు. నితీశ్‌కు మద్దతు ప్రకటించారు. బీజేపీ తన మిత్రపక్షాలనే బలహీనపర్చాలని చూస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే మహారాష్ట్రలో శివసేనను బలహీనపరచడానికి, చీలికలు సృష్టించడానికి కుట్రలు చేస్తోందని చెప్పారు. పంజాబ్‌లో కీలకమైన అకాలీదళ్ పార్టీని బీజేపీ నాశనం చేసిందని గుర్తుచేశారు. ప్రకాశ్ సింగ్ బాదల్ తమతోనే ఉన్నారని బీజేపీ చెబుతున్నా ఆ పార్టీకి భవిష్యత్తు లేకుండా పోయిందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీతో కలిసి నడిచే ఏ పార్టీ అయినా నశించిపోవాల్సిందేనని జోస్యం చెప్పారు. నితీశ్ ముందుగానే మేల్కొని ఆ పార్టీతో తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారన్నారు.

బీహార్‌లో బీజేపీ నిరసన

పాట్నా: ఎన్‌డీఏ కూటమి నుంచి తప్పుకొని బీహార్ సీఎం నితీశ్ కుమార్ నమ్మకద్రోహం చేశారని బీజేపీ శ్రేణులు ఆరోపించాయి. నితీశ్ కుమార్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బుధవారం పాట్నాలోని బీర్‌చంద్ పటేల్ మార్గ్‌లోని పార్టీ కార్యాలయం ముందు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు.నితీశ్ కుమార్ చేసిన ద్రోహాన్ని వివరిస్తూ అన్ని జిల్లాల్లో ప్రచారం చేస్తామని చెప్పుకొచ్చారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ నితీశ్‌కు ప్రధాని మోదీ అంటే అసూయ అని ఆరోపించారు. ప్రధాని కావాలనే ఆశతోనే ఈ తరహా చర్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పొత్తులు లేకుండా సొంతంగా గెలవడానికి ప్రయత్నించాలని సూచించారు. బీహార్‌లో నితీశ్ తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్ని కలవర పెట్టింది. దేశభక్తి పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఆ పార్టీ శ్రేణులు నితీశ్ తమ పార్టీతో పొత్తు నుంచి వైదొలుగుతూ తీసుకున్న నిర్ణయం కారణంగా అయోమయానికి గురవతున్నట్టు స్పష్టమవుతోంది.

అధ్యక్ష ఎన్నికలకు కాంగ్రెస్ రెడీ

21 నుంచి ప్రక్రియ మొదలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ కొనసాగుతున్నారు. కొత్త అధ్యక్షుడి కోసం పార్టీ కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఆగస్టు 21 నుంచి కొత్త అధ్యక్షుడి ఎన్నికలు జరగనున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే.. ఆ పదవికి పోటీ పడే అంశంపై పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ఎలాంటి ప్రకటన చేయకపోవటంపై ఉత్కంఠ నెలకొంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలు కావడంతో అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. మరోమారు పార్టీ పగ్గాలు చేపట్టాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నా.. ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. గాంధీయేతర వ్యక్తిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవటంపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోంది. ఈ విషయంపై ఏకాభిప్రాయం కుదరటం లేదు. కాంగ్రెస్ నేతల్లో చాలామంది అధ్యక్ష పదవి గాంధీ కుటుంబంలోని వ్యక్తే చేపట్టాలని, అదే పార్టీ భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్టీ ఓటమి చెందడంతో పార్టీ సీనియర్ నేతలకు సోనియా గాంధీ కీలక సూచనలు చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీలతో పాటు రాజీనామా చేయాలని సూచించారు. రాహుల్ గాంధీ 2017లో సోనియా గాంధీ నుంచి పార్టీ పగ్గాలు తీసుకున్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 543 స్థానాలకుగాను కాంగ్రెస్ పార్టీ 52 స్థానాలకే పరిమితం కావటంతో మే నెలలో రాహుల్‌గాంధీ పార్టీ పగ్గాలు వదులుకున్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికల తర్వాతే..కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఇతర పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీ సెప్టెంబర్ 7న ప్రారంభించనున్న భారత్ జోడో యాత్రపైనే దృష్టిసారించారు.

షిండే వర్గంలో అప్పుడే లుకలుకలు?

ముంబై: మహారాష్ట్రలో కొత్త సంకీర్ణ కూటమి(బీజేపీ, అసమ్మతి శివసేన) ప్రభుత్వం ఏర్పడిన ఆరువారాల తర్వాత కేబినెట్ విస్తరణ జరిగింది. చెరో పార్టీ నుంచి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో అసమ్మతి వర్గ శివసేన ఎమ్మెల్యే సంజయ్ రాథోడ్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ మహిళను ఆత్మహత్యకు పురిగొల్పాడనే ఆరోపణలతో గత ఏడాది సంజయ్ రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాత ఆయన శివసేనలో అసమ్మతికి నేతృత్వం వహించిన ఏక్‌నాథ్ షిండే క్యాంపులో చేరారు. తాజాగా మంత్రి పదవిని దక్కించుకున్నారు. దీనిపై మహారాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు చిత్రా వాఘ్ ..ట్విటర్ వేదికగా ఆయన నియామకాన్ని నిరసించారు. 'ఆయనకు మంత్రి పదవి ఇచ్చినా.. నేను నా పోరాటం కొనసాగిస్తాను. న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. మేం పోరాడి గెలుస్తాం' అని ఆమె వెల్లడించారు. అయితే ఈ నియామకాన్ని ముఖ్యమంత్రి షిండే సమర్థించారు. మునుపటి ప్రభుత్వ హయాంలో ఆయనపై విచారణ జరిగింది. అనంతరం పోలీసులు క్లీన్ చిట్ ఇచ్చారు. అందుకే మంత్రిగా ఎంపిక చేశాం. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారితో మాట్లాడతాం' అని షిండే బదులివ్వడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ సమయంలో గత ఏడాది బీజేపీ నేత కిరీట్ సోమయ్య చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. అది సంజయ్ కారణంగా జరిగిన ఆత్మహత్య కాదు.. హత్య అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారందులో. కానీ ఇప్పుడు జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరోపణలపై ఏ విధమైన వ్యాఖ్య చేయలేదు.

యావత్మల్‌లోని దిగ్రాస్ నియోజకవర్గానికి చెందిన సంజయ్ రాథోడ్‌తో మృతురాలికి సంబంధం ఉందని, అది బెడిసికొట్టి ఆమె ఆత్మహత్యకు దారితీసిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ కారణంగా ఆయన రాజీనామాచేయాల్సి వచ్చింది. షిండే మంత్రివర్గంలో చోటు లభిస్తుందన్న ఊహాగానాల మధ్య ఆయనకు లభించిన క్లీన్‌చిట్ గురించి గతనెల షిండే ప్రస్తావించారు.

హిందువుల్లోనే బహుభార్యత్వం

నాలుగో స్థానంలో ముస్లింలు

'ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5' సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: భారతదేశంలో బహుభార్యత్వంపై ఓ సర్వే సంచలన విషయాలు వెల్లడించింది. దేశంలో ముస్లిం వర్గంలోనే బహుభార్యత్వం లేదా అనేక మంది మహిళలతో భౌతిక సంబంధాలు ఉంటాయన్న ఆరోపణల్లో పసలేదని తేల్చిచెప్పింది. వాస్తవంగా అన్ని మతాల్లో కన్నా హిందూ మతంలోని పురుషులే బహు లైంగిక భాగస్వాములను కలిగి ఉంటున్నారని వెల్లడించింది. ఈ విషయంలో హిందూ పురుషులు ముందు వరుసలో ఉంటే.. ఆ తర్వాత స్థానంలో సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, ముస్లింలు, జైనులు ఉన్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) సర్వే డేటాను 'ది వైర్' వెల్లడించింది. 2019-20లో కేంద్ర ప్రభుత్వం కోసం ముంబైకి చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ ఈ సర్వే నిర్వహించింది. హిందూ పురుషులు పెళ్లి కాకుండా లివింగ్ ఇన్ రిలేషన్‌షిప్ లేదా అక్రమ సంబంధాలు కలిగి ఉండేందుకు ఇష్టపడుతున్నారని తెలిపింది. వారి జీవితకాలంలో సగటున 2.2 శాతం మంది లైంగిక భాగస్వాములను కలిగి ఉన్నారని పేర్కొంది. సిక్కులు, క్రైస్తవులు 1.9శాతం, బౌద్ధులు, ముస్లింలు సగటున 1.7శాతం మందితో లైంగిక సంబంధాలు కలిగి ఉంటున్నారని వివరించింది. జైనులు అత్యల్పంగా సగటున 1.1 శాతం మంది మాత్రమే. అనేకమంది మహిళలతో శారీరక సంబంధాల వల్ల లైంగికపరంగా సంక్రమించే వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాలు వచ్చే ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని సర్వే పేర్కొంది. 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 8.25 లక్షల మందిని సర్వే చేయగా 1.01 లక్షల మంది పురుషులు సర్వేలో పాల్గొన్నారు. 2015-16 మధ్య కాలంలో ఎన్‌హెచ్ఎఫ్ఎస్-4 చేపట్టిన సర్వే ప్రకారం క్రైస్తవ పురుషులు సగటున 2.4 మందితో అత్యధిక లైంగిక భాగస్వాములను కలిగి ఉన్నారు. బౌద్ధులు, ముస్లింలు 2.1 మంది, హిందువులు 1.9 మంది భాగస్వాములున్నారు. గత సర్వేతో పోల్చి చూస్తే హిందూ మత వర్గంలోని పురుషులు... అనేక మందితో లైంగిక సంబంధాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎన్‌హెచ్ఎఫ్ఎస్-5 సర్వేకు ముందు సంవత్సరంలో ఎంతమంది పురుషులు తమ భార్య కాని వారితో భౌతిక సంబంధాలు పెట్టుకున్నారో కనుగొనేందుకు ప్రయత్నిస్తోంది. ఈ సర్వేలో పాల్గొన్న బౌద్ధ పురుషుల్లో 7.8 శాతం మంది అక్రమ సంబంధాలపై అవుననే సమాధానమిచ్చారు. తర్వాత సిక్కులు 6.0 శాతం, హిందువులు 4 శాతం, క్రైస్తవులు 3.8 శాతం, ముస్లింలు 2.6 శాతం మంది ఉన్నారు. మొత్తం మీద సర్వేకు ముందు 12 నెలల్లో భార్యతో కాకుండా ఇతర మహిళలతో అక్రమ సంబంధాలు నెరిపిన పురుషులు 4 శాతం మంది ఉన్నట్లు తేలింది.ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 నిర్వహించడానికి 12 నెలల ముందు అనేకమార్లు లైంగిక సంబంధాలు నెరిపిన ముస్లింలలో పురుషులు అత్యధికంగా కండోమ్‌లు వినియోగించారు. వీరిలో 64.1 శాతం మంది ముస్లిం పురుషులు ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో బౌద్ధులు 58.2 శాతం, క్రైస్తవులు 44.7 శాతం మంది ఉన్నారు. ధనిక, రెండవ, మధ్య, పేదవాడు దగ్గర నుండి 2.0 శాతం-2.5 శాతం మంది పురుషులు తమ అభ్యాసంలో నిమగ్నమై ఉన్నారని తేలింది. ఎస్‌టికి చెందిన పురుషుల్లో అత్యధికంగా 2.4 శాతం మంది ఉండగా, ఆ తర్వాత ఇతర వెనుకబడిన తరగతులు 2.2 శాతం, ఎస్‌సీలకు చెందిన వారిలో ఆ శాతం 2.1గా ఉంది. రాష్ట్రాల్లో మేఘాలయ అగ్రస్థానంలో ఉండగా... సిక్కిం, ఆంధ్రప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను ముస్లింలో అత్యధికంగా 1.9 శాతం ఉండగా.. ది వైర్ విశ్లేషణ ప్రకారం హిందూ పురుషుల్లోనే గరిష్ట సంఖ్యలో లైంగిక భాగస్వాములను కలిగి ఉన్నారు.

హిందూ పురుషుల్లో బహుభార్యత్వం 1.3 శాతంగా ఉంది. ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం భారత్‌లో ముస్లింలు చట్టబద్ధంగా ఒకటి కంటే ఎక్కువ మంది భార్యలు కలిగి ఉండవచ్చు. కానీ హిందూ, ఇతర మతస్థులకు ఇది వర్తించదు. గత సర్వేతో పోలిస్తే..ఈ సర్వేలో బహుభార్యత్వం తగ్గి..బహు లైంగిక ధోరణి పెరిగినట్లు కనిపిస్తోంది. చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, రాజస్తాన్, జార్ఖండ్, మేఘాలయ, త్రిపుర, మహారాష్ట్ర, పుదుచ్చేరి మినహా దాదాపు ప్రతి రాష్ట్రంలో బహు భార్యత్వం రేటు తగ్గింది. మేఘాలయలో 6.1 శాతం, మిజోరంలో 4.1 శాతంతో బహుభార్యత్వ వివాహాలు అత్యధికంగా ఉన్నాయి.

బలహీన వర్గాలకు సీపీఐ అండ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఓబులేసు
- కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ విజయవంతం: తాటిపాక మధు

మాట్లాడుతున్న ఓబులేసు. వేదికపై రావుల, ప్రసాద్ తదితరులు

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

విశాలాంధ్ర-కాకినాడ: భారత కమ్యూనిస్టు పార్టీ కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ బుధవారం కాకినాడలో స్థానిక గాంధీభవన్‌లో తోకల ప్రసాద్, జీ లోవరత్నం, కామిరెడ్డి బోడకొండ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక భానుగుడి సెంటర్ నుంచి భారీ ప్రదర్శన ప్రారంభమై టూ టౌన్, బ్రిడ్జి, మెయిన్ రోడ్, ఎల్‌ఐసీ ఆఫీస్, కల్పనా సెంటర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకూ జరిగింది. అనంతరం అక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రావుల వెంకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు హాజరయ్యారు. మున్సిపల్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ, కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఓబులేసు మండిపడ్డారు. అదానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను చౌక ధరలకు అమ్ముతున్నారని, ప్రభుత్వ రంగాలను నష్టాల పేరుతో నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ప్రజలపై పన్నులు రూపంలో జీఎస్టీ టాక్స్‌లో విధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పథకాల అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆయన అన్నారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీలో రైతన్నల ఉద్యమంలా ప్రజా ఉద్యమాలు జరగాలని, టిడ్కో గృహాలు మంజూరు చేయడం లేదని, నవరత్నాలు పేరుతో ప్రజలపై అధిక పన్నుల భారాలు విధిస్తూ పెట్రో, నిత్యవసర ధరలు, ఆస్తి పన్నులు, చెత్త పై యూజర్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని, వీటిని ప్రజలు గమనిస్తున్నారని ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. తాటిపాక మధు మాట్లాడుతూ రకరకాల బ్రాండ్లతో ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహిస్తూ ప్రజలతో చెలగాటమాడుతుందని, మద్యపాన నిషేధం పూర్తిస్థాయిలో చేయకపోతే సీపీఐ అధ్వర్యంలో ఉద్యమం చేపడామని, కాకినాడలో మున్సిపల్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పటికే మంజూరు చేయకపోవడం దౌర్భాగ్యం అని, కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ జయప్రదం అయిందని, మహాసభకు సహకరించిన వారందరికీ సీపీఐ తరపున అభినందనలు తెలియజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, లోవరత్నం, బొబ్బిలి శ్రీనివాసరావు, తుపాకుల లక్ష్మీనారాయణ, టీ అన్నవరం, బొబ్బిలి సత్యనారాయణ, కామిరెడ్డి బోడకొండ, శివకోటి రాజు, పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాంబాబు, రాజమండ్రి నగర సీపీఐ కార్యదర్శి వి. కొండలరావు, వివిధ ప్రాంతాలతో పాటు ఏడు నియోజకవర్గాల ప్రజా సంఘాల సభ్యులు, బాధ్యులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా కార్యదర్శిగా బోడకొండ

సహాయ కార్యదర్శులుగా తోకల ప్రసాద్, జి.లోవరత్నం

బోడకొండ

ప్రసాద్

లోవరత్నం

సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శిగా కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శిగా తోకల ప్రసాద్, జీ లోవరత్నం బుధవారం ప్రతినిధుల సభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పీ సత్య నారాయణ, శివకోటి రాజు, బొబ్బిలి శ్రీనివాస్‌రావు, టీ అన్నవరం, పీస్ నారాయణతో పాటు 21 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరిని సీపీఐ రాష్ట్ర నాయకులు జీ ఓబులేసు, రావుల వెంకయ్య, తాటిపాక మధు అభినందించారు.

సీపీఐ జాతీయ మహాసభలకు రైతు సంఘం లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం లక్ష రూపాయల విరాళం అందించింది. ఈ మేరకు విజయవాడ దాసరిభవన్‌లో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య బుధవారం ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు రూ.లక్ష అందచేశారు. ఆహ్వాన సంఘం కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శి-సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రైతు సంఘం కార్యాలయ కార్యదర్శి ఎంఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకాన్ని అమ్ముకోవడం సిగ్గు చేటు: రాహుల్

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ వాదాన్ని అమ్ముకుంటోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ ఆరోపించారు. రేషన్‌కార్డుదారులు జాతీయ జెండాను కొనుగోలు చేయాలని బలవంతం చేయడానికి ప్రభుత్వమే కారణమన్నారు. రేషన్ కావాలంటే జాతీయ జెండాను కొనాలంటూ పేదల ఆత్మగౌరవాన్ని కేంద్రం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. భారత త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుని గుండెల్లో ఉందని ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. రేషన్ దుకాణాల్లో రేషన్ ఇవ్వాలంటే రూ.20 చెల్లించి జాతీయ జెండాను కొనాలని బలవంతం చేయడం సిగ్గు చేటని స్పష్టం చేశారు. ఇది పేద ప్రజలను ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు త్రివర్ణ పతాకాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.

సీనియర్ అడ్వకేట్లకు నో చాన్స్: సీజేఐ

న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో వెంటనే విచారించాల్సిన కేసులను సూచించేందుకు సీనియర్ న్యాయవాదులకు అవకాశం ఉంటుంది. అయితే ఆ సంస్కృతికి చెక్ పెట్టాలని యోచిస్తున్నట్లు సీజేఐ ఎన్వీ రమణ బుధవారం అన్నారు. సీనియర్లకు ఇకపై కేసులను సూచించే అనుమతి లేదని తేల్చిచెప్పారు. 'నేను సీనియర్లు చెప్పేది విననని.. క్యూలో ఉన్న సీనియర్ న్యాయవాది ఒకరు 'అర్జెంట్ లిస్టింగ్' కేసును సూచించే సమయంలో సీజేఐ రమణ అన్నారు. వాటిని మరుసటి రోజు సూచించాల్సిందిగా తమ అడ్వకేట్ ఆన్ రికార్డుకు చెప్పమన్నారు. జస్టిస్ కృష్ణమురారీ, జస్టిస్ హిమా కోహ్లీతో కలిసి సీజేఐ రమణ కేసుల విచారణను చేపట్టారు. కేసులను సూచించేందుకు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఏఎం సింఘ్వీకీ అనుమతి ఇవ్వలేదు. 'కేసులను సూచించేం దుకు సీనియర్లకు అనుమతి ఇవ్వకపోవడమే మంచిది. ఈ పద్ధతి రూపుమాపాల్సి ఉంది. క్షమించండి, మిస్టర్ సింఘ్వీ.. నేను సీనియర్ల సూచనలను వినాలనుకోవడం లేదు. మిస్టర్ సిబల్, ఇది మీకూ వర్తిస్తుంది. వీటి గురించి మీమీ ఏఓఆర్‌లకు చెప్పండి' అని సీజేఐ రమణ అన్నారు. ఇదే విషయంలో జూనియర్ న్యాయవాదుల నుంచి విజ్ఞప్తులు వచ్చినట్లు కొద్దిరోజుల కిందట జస్టిస్ రమణ తెలిపారు. తక్షణమే విచారించాల్సిన కేసులను సూచించే అవకాశం సీనియర్లకు ఇవ్వవద్దని వారు కోరారన్నారు. సీజేఐ రమణ గతేడాది ఏప్రిల్ 24న న్యాయ వ్యవస్థ అధిపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈనెల 26న పదవీ విమరణ పొందనున్నారు. 16నెలలకుపైగా సాగిన ఆయన పదవీకాలం ముగియనుంది.

భూ పోరాట యోధుడు దాసరి

- నిత్యం ప్రజా ఉద్యమాలతో మమేకం
- నేటి తరం కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకం
- నివాళులర్పించిన సీపీఐ, ప్రజా సంఘాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరజీవి దాసరి నాగభూషణరావు భూపోరాట యోధులని, ఆయన ఉద్యమ పటిమ నేటి తరం కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. విజయవాడ దాసరి భవన్‌లో సీపీఐ రాష్ట్ర సమితి-ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో బుధవారం అమరజీవి కామ్రేడ్ దాసరి నాగభూషణరావు 97వ జయంతి సభను నిర్వహించారు. దాసరి చిత్రపటానికి రామకృష్ణతోపాటు మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, అక్కినేని వనజ, పార్టీ, అనుబంధ సంఘాల నేతలు పూలమాల లేసి విప్లవ జోహార్లు అర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ, ఆయన నిత్యం ప్రజా ఉద్యమాలతోనే మమేకమై ఉండేవారన్నారు. ప్రధానంగా భూ పోరాటాలపై దృష్టి సారించే వారని, ఎక్కడ భూ సమస్యలు, ఇళ్ల స్థలాల ఇబ్బందులు ఎదురైనా తక్షణమే అక్కడకు వెళ్లి మమేకమ య్యేవారని, వారికి వెన్నుదన్నుగా నిలిచేవారని గుర్తు చేశారు. దాసరి విద్యార్థి నాయకునిగా మొదట్లో తన జీవితాన్ని ప్రారంభించినప్పటికీ, ఆ తర్వాత పార్టీలో అన్ని స్థాయి పదవులు నిర్వర్తించారన్నారు. సీపీఐ శాఖా కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శి వరకు ఎదిగిన నేత దాసరి అని కొనియాడారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై ప్రజా సమస్యల్ని చట్ట సభల్లో ప్రస్తావించారన్నారు. హైదరాబాద్‌లోని సీఆర్ ఫౌండేషన్ ఏర్పాటులో దాసరి మూల విరాట్‌గా నిలిచారని పేర్కొన్నారు. దాసరితో కలిసి చాలామంది ఉద్యమాల్లో పాల్గొన్నారని, మరికొందరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలున్నా యని చెప్పారు. దాసరి తుదిశ్వాస వరకు పార్టీ కోసం శ్రమించారని, కుటుంబ ఆస్తులను సైతం ప్రజలకు త్యాగం చేశారన్నారు. 1975లో విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో దాసరి కీలక పాత్ర పోషించారని, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉండి, మహాసభల విజయవంతానికి కృషి చేశారని గుర్తు చేశారు. దాసరి స్ఫూర్తి, పట్టుదలతో ముందుకు వెళతామని, 24వ జాతీయ మహాసభల జయప్రదానికి పార్టీ శ్రేణులంతా మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. విజయవాడ కేంద్రంగా జరగబోయే పార్టీ జాతీయ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత నెలకొందని, దేశ రాజకీయాలను ఇవి కీలక మలుపు తిప్పనున్నాయని వెల్లడించారు. ఇవాళ బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో బీజేపీ నుంచి ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలోని జగన్, చంద్రబాబు మాత్రం మోదీతో సన్నిహితంగా మెలుగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బలహీనమైన రాజకీయం తయారైందన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపై వచ్చి, బీజేపీ అనుసరి స్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, దానికి పార్టీ 24వ జాతీయ మహాసభలు వేదిక కానున్నాయని పునరు ద్ఘాటించారు. సభకు విజయవాడ సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, సీపీఐ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల కార్యదర్శులు సీహెచ్.కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శులు టి.తాతయ్య, అడ్డాడ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, మహిళా సమాఖ్య నాయకులు రాణి, పంచదార్ల దుర్గాంబ, రాష్ట్ర, నగర, జిల్లాల పార్టీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కోశాధికారి ఆర్.పిచ్చయ్య విప్లవ గీతాలను ఆలపించారు.

చెస్ ఒలింపియాడ్‌లో అదరగొట్టిన మాస్టర్లు

భారత్‌కు రెండు పతకాలు!

చెన్నై: భారత అథ్లెట్లు సూపర్ పెర్ఫామెన్స్‌తో కామన్వెల్త్ గేమ్స్‌ను ముగించిన తర్వాతి రోజే చెస్ గ్రాండ్ మాస్టర్స్ తమ ఎత్తులతో అదరగొట్టారు. చదరంగంలో అత్యుత్తమ టోర్నీ అయిన చెస్ ఒలింపియాడ్‌లో పతకాల మోత మోగించారు. భారత్ తొలి ఆతిథ్యం ఇచ్చిన ఈ మెగా ఈవెంట్ మహిళల విభాగంలో కోనేరు హంపి, ద్రోణవల్లి హారికతో కూడిన జట్టు బ్రాంజ్ మెడల్‌తో చరిత్ర సృష్టించింది. ఒలింపియాడ్‌లో మహిళల జట్టుకు ఇదే తొలి పతకం. మరోవైపు ఓపెన్ సెక్షన్‌లో యువ గ్రాండ్ మాస్టర్స్‌తో కూడిన భారత్-బి జట్టు కూడా సిల్వర్ గెలిచింది. ఓపెన్, మహిళల విభాగంలో సంయుక్తంగా బెస్ట్ పెర్ఫామెన్స్‌కుగాను భారత్-ఏ ప్రతిష్టాత్మక గఫ్రిందాష్విలి ట్రోఫీని కైవసం చేసుకుంది. అదే సమయంలో వ్యక్తిగత మెడల్స్‌లో యంగస్టర్స్ రెండు గోల్డ్ సహా ఏడు పతకాలు కైవసం చేసుకొని శభాష్ అనిపించారు. తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ సిల్వర్‌తో మెరిశాడు.

మూడో స్థానంలో భారత్- బి

మరోవైపు వంతిక, పద్మిని రౌత్, మేరీ ఆన్ గోమ్స్, దివ్యలతో కూడిన భారత్-బీ ఎనిమిదో స్థానం సాధించగా.. భారత్-సీ (ఈషా, నందిద, సాహితి, ప్రత్యూష) 17వ స్థానంలో నిలిచింది. ఉక్రెయిన్ స్వర్ణం గెలుచుకుంది. ఆఖరి రౌండ్లో ఆ జట్టు 3-1తో పోలెండ్‌పై విజయం సాధించింది. జార్జియా రజతం గెలుచుకుంది. ఓపెన్ విభాగంలో భారత్-బీ మూడో స్థానంలో నిలిచింది. గుకేశ్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానంద, రౌనక్ సధ్వానిలతో కూడి ఈ జట్టు ఆఖరి రౌండ్లో 3-1తో జర్మనీపై విజయం సాధించింది.

రెండు స్వర్ణాలు..

లివ్యూ డైటర్‌పై రౌనక్, మతియాస్‌పై నిహాల్ నెగ్గగా.. విన్సెంట్తో గేమ్‌ను గుకేశ్, రాస్మస్‌తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించారు. అమెరికాతో తమ చివరి రౌండ్ గేమ్‌ను డ్రాగా ముగించిన భారత్-ఏ (హరికృష్ణ, విదిత్, అర్జున్ నారాయణన్).. నాలుగో స్థానంలో నిలిచింది. భారత్-సీ జట్టు 31వ స్థానం సాధించింది. ఉజ్బెకిస్థాన్ స్వర్ణం ఎగరేసుకుపోయింది. బలమైన అర్మేనియా జట్టును రజతానికి పరిమితం చేసింది. చెస్ ఒలింయాడ్‌లో భారత్ 2014లో తొలిసారి పతకం (ఓపెన్‌లో కాంస్యం) గెలుచుకుంది. వ్యక్తిగత ప్రదర్శనలకుగాను గుకేశ్, సరీన్ స్వర్ణాలు.. అర్జున్ రజతం గెలుచుకున్నారు. ప్రజ్ఞానంద, వైశాలి, తానియా, దివ్య కాంస్యాలు సాధించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.